# ఆత్మహత్య

**చి**రంజీవి వంతెనమీద కొచ్చాడు.

నిర్మానుష్యంగా వుందక్కడ. బ్రిడ్జిమీద లైట్లు కూడా డిమ్ముగా వెలుగుతున్నాయ్. టైము చూసుకున్నాడతను. సరిగ్గా అర్ధరాత్రి అయింది.

ఉండండి చలిగాలి రివ్వున వీచి వణుకు పట్టిస్తోంది.

"ఓ రగ్గు వుంటే బావుండు!" అనుకున్నాడు చిరంజీవి. వెచ్చగా, హాయిగా వుంటుంది.

అంతలోనే నవ్వు వచ్చిందతనికి.

ఇదేమిటి? నదిలోకిదూకి చావాలని వచ్చినవాడికి రగ్గుల మీద కోరికేమిటి మళ్ళీ?

వంతెన మధ్యకొచ్చి నిలబడ్డాడతను. గోడ అంచుకెళ్ళి ఓసారి నదిలోకి తొంగిచూశాడు. నిశ్శబ్దంగా ప్రవహిస్తోంది నది. నీళ్ళ ఒరవడి శబ్దం వుండుండి వినబడుతోంది.

మళ్ళీ వెనుకకు నడిచి ఎత్తుగా వున్న సిమెంట్ దిమ్మ మీద కూర్చున్నాడతను.

మరికొద్దిసేపట్లో చిరంజీవి అనే నిర్భాగ్యుడి కథకు ఫుల్‌స్టాప్ పెట్టేయబోతున్నాడు తను.

లేపోతే ఏమిటి!

ఎంతకాలం భరించాలీ చాలీ చాలని జీవితం? ఎంతకాలం సహించాలీ దరిద్రం? ఒకరోజా, రెండు రోజులా? చిన్నప్పటి నుంచీ ఇదే దరిద్రం వెంటాడుతోంటే ఎవరికి మాత్రం విరక్తి పుట్టదు? ఒకపూట తినీ, మరోపూట తినకా, కట్టుకోడానికి సరయిన బట్టల్లేకా, ఉదయం పదినుంచీ రాత్రి ఏడువరకూ గొడ్డుచాకిరి చేస్తూ ఎందుకొచ్చిన బ్రతుకిది? ఆ తరువాతయినా విశ్రాంతి వుందా? కుక్కలను తీసుకుపోయే మున్సిపాలిటీ బండిలా, ఒకరిమీద ఒకరు నిలబడే ఆర్టీసీబస్‌లో రెండు మైళ్ళు చెమటతో స్నానం చేస్తూ ప్రయాణంచేసి, ఇంటికొస్తే – అహ్హహ్హ అది ఇల్లా? తను చిన్నప్పుడు చూసిన గొడ్లపాకలు ఎంతో విశాలంగా, ఆరోగ్యకరంగా వుంటాయ్! అంతకంటె హీనమయిన ఆ ఒక్కగది కొంపలో ఎండవేడికి, దానిగాలికీ, కాగిపోతూ రాత్రంతా గడిపి.. పోనీ ఈ

కుక్క బ్రతుకంతా బ్రతికాడే అనుకుందాం! ఇదంతా ఎవరికోసం? నా అనేవాళ్ళే లేని బ్రతుకెందుకసలు? అందుకే చావాలని నిర్ణయించుకున్నాడు తను.

తను చచ్చినంత మాత్రాన కొంపలేం మునిగిపోవు. దేశమేం తల్లడిల్లి పోదు.

ఎవడో గుర్తు తెలీని సన్యాసి నదిలో దూకి చచ్చాడని పేపర్లో వేస్తారు.

"చిరంజీవి సూసయిడ్ చేసుకున్నాడటోయ్ అతని ప్లేస్‌లో ఇంకొకడిని భర్తీ చేసెయ్యండి" అంటాడు తన ప్రొప్రయిటరు. తన గదికి ఎదురుగ్గా పాకలో ఉండే జానకి తను పోయాడని తెలీగానే ఆ రూమ్‌లో ఈసారి కొంచెంలో డబ్బున్న వాడు దిగితే బాగుండునని అనుకుంటుంది.

అంతే! ఆ తరువాత చిరంజీవి అనేవాడు ఒకడు ఫలానా పీరిడ్‌లో ఉండేవాడు అన్న గుర్తు కూడా ఉండదు.

అదే తనో ధనవంతుడయితే?

తన చావు వార్త టి.వి. రేడియోల్లో చెప్తారు. తన ఫోటో పేపర్లలో ప్రచురిస్తారు. ప్రముఖులందరూ తన మరణం ఆశనిపాతం అంటూ స్టేట్‌మెంట్స్ ఇస్తారు. పత్రికల్లో ఎడిటోరియల్స్ రాస్తారు.

తను పనిచేస్తున్న ఫ్యాక్టరీకి ఆ రోజు శెలవు ఇచ్చేస్తారు. సాయంత్రం సంతాపసభ జరుగుతుంది. తనమీద కవులు రాసిన పద్యాలు చదువుతారు.

నవ్వు వచ్చేసింది చిరంజీవికి.

అవును! ఇలాంటి కుక్కబ్రతుకు బ్రతకడం కంటె నిస్సందేహంగా చావడం వుత్తమం. వారం రోజులపాటు ఆలోచించే ఈ నిర్ణయం తీసుకున్నాడు తను.

అవునూ, తనెందుకింకా ఆలస్యం చేస్తున్నట్లు?

లేచి నిలబడ్డాడతను.

ఇంక ఆలస్యం అనవసరం! ఆలోచనలూ అనవసరమే! చాలామంది ఆఖరి క్షణాల్లో ఆలోచించి మనసు మార్చుకుని ఝామ్మని ఈలపాట పాడుతూ ఇంటికెళ్ళిపోయారట! అంచేత తను ఆలోచించకూడదు.

మళ్ళీ వంతెన గోడ దగ్గరకు నడిచాడు చిరంజీవి. కింద అంతా కటిక చీకటిగా ఉంది. ఆ చీకట్లో ఏ రాయిమీదయినా పడితే? పచ్చడయిపోతాడు! ఒళ్ళు గగుర్పొడిచింది చిరంజీవికి.

ఛీ! ఏమిటీ పిచ్చి ఆలోచనలు? చచ్చేవాడు ఎలా ఛస్తేనేం?

“ఏయ్!” అటువైపు చూశాడు చిరంజీవి. కాకీ బట్టలూ, నల్లబూట్లూ, చిరంజీవి ఎందుకయినా రెండడుగులు వెనక్కు వేసి నిలబడ్డాడు. పోలీస్ త్వరత్వరగా అతని దగ్గరకొచ్చాడు.

“ఏయ్! ఎవర్నువ్వు?” అడిగాడతను అనుమానంగా చూస్తూ.

“నా పేరు చిరంజీవండీ!”

“నీ అయ్య పేరేమిటి?”

“ధనుంజయ్ అంటారండీ!”

“సరే! ఇంతరాత్రివేళ ఇక్కడేం చేస్తున్నావ్?”

“ఏమీ లేదండీ! సరదాగా నిలబడి ఆలోచిస్తున్నాను.”

“ఆలోచిస్తున్నావా?”

“అవునండీ!”

“ఏమాలోచిస్తున్నావ్?”

“ఏమిటంటే – ఏమిటంటే ఫలానా అని ఏమీ లేదండీ. జనరల్ విషయాలు ఆలోచిస్తున్నాను.”

“జనరల్ అంటే?”

“అంటే –అంటే – అదేనండీ బీహార్‌లో ఆకలిచావులు, ఆంధ్రప్రదేశ్‌లో సైక్లోన్‌లు, అమెరికాలో నీగ్రోల గురించీ, ఇంకా....”

“ఆ– ఇంకా?”

“ఇంకా... ఆ! జపాన్‌లోని ‘కోషిబా’ అనే అడవితెగ గురించీ –”

“కోషిబానా?”

“అవునండీ! అంటే జపాన్‌లో ఒక అడవితెగ అన్న మాటండీ! వాళ్ళ పద్ధతులు చాలా తమాషాగా ఉంటాయండీ. ఉదాహరణకు వాళ్ళ పెళ్ళిళ్ళు ఉన్నాయనుకోండి. పెళ్ళిలో పెద్దలందరూ కలసి పెళ్ళికొడుకుని చావగొడతారండీ–”

“ఏమిటి? చావగొడతారా?”

“అవునండీ!”

“అంటే ఆ చుట్టుపక్కలెక్కడా పోలీస్‌స్టేషన్ లేదా?”

"ఉన్నా వాళ్ళు లెక్కచేయరండీ! అది వాళ్ళ కల్చర్ అన్నమాట–"

"అంటే?"

"అంటే ఆచారవ్యవహారాలు, సాంప్రదాయాలు అంటాం చూడండి. అదన్నమాట! వీటిని ఎవరూ కాదనలేరండీ!"

"ఏమిటీ? ఆచారవ్యవహారాలని ఎవరేం చేసినా చూస్తూ ఊరుకుంటే ఇంక లా అండ్ ఆర్డర్ ఎందుకయ్యా? – వాళ్ళందరినీ క్రిమినల్ ఎసాల్ట్‌కింద బుక్‌చేసే పారేస్తాను–నేనక్కడ ఉన్నట్లయితే"

"కానీ వాళ్ళ ఆచారవ్యవహారాల్లో ఎవరు జోక్యం చేసుకున్నా వాళ్ళూరుకోరు గదండీ!"

"ఊరుకోకపోతే వదిలేస్తామా? అందరినీ బొక్కలోకి తోసేస్తాం! ఆ! నా సంగతి నీకు తెలీదనుకుంటా! సంక్రాంతి నాడు కోడిపందాలు ఆడుతున్న వారందరినీ లోపట వేసేశాను. అది మన సాంప్రదాయమని వదిలానా? లేదే? నేను కూర వండుకోడానికి రెండు కోళ్ళు ఇస్తానన్నా వదల్లేదే? ఎందుకని? ఇలాంటి విషయాల్లో నేను చాలా గట్టి–కానిస్టేబుల్ కనకారావ్ అంటే ఎవర్నయినా అడుగు! చెప్తారు. 'లా' అంటే 'లా'యే! ఒక్క అంగుళం తేడా రావడానికి వీల్లేదు"

"అలాగాండీ–"

"అవును!"

చిరంజీవి సైలెంట్ అయిపోయాడు,.

"అయితే నువ్ ఆత్మహత్య చేసుకోవడానికి రాలేదంటావ్. అంతేనా?"

చిరంజీవి నవ్వేశాడు.

"ఆత్మహత్యా– అదేంటండీ అలా అడిగారు?"

'ఏమో ఈ బ్రిడ్జిమీద ఇంత రాత్రిలో తిరుగుతూంటే.."

"ఛ ఛ! తప్పుకదండీ! ఆత్మహత్య నేనెందుకు చేసుకుంటాను?"

"ఏమో! ఈ మధ్య ఇదో ఫాషనయి పోయిందిలే! ప్రతి వెధవా ఆత్మహత్య చేసుకునే వాడే! తిండిలేకపోతే ఆత్మహత్య! పరీక్ష ఫెయిలయితే ఆత్మహత్య. ఇంట్లోవాళ్ళు గట్టిగా కూకలేస్తే ఆత్మహత్య, ప్రేమ బెసికితే ఆత్మహత్య. ఆఫీసరు సతాయిస్తే ఆత్మహత్య. ప్రమోషను దొరక్కపోతే ఆత్మహత్య, సినిమా టికెట్ దొరక్కపోతే ఆత్మహత్య. తన అభిమాన సినిమా నటుడు ఛస్తే ఆత్మహత్య. అభిమాన రాజకీయ నాయకుడు టపాకడితే వీడూ ఆ నాయకుడికి తోడు – ఛ ఛ! ఈ అడ్డమయిన ఆత్మహత్యలన్నీ చివరకు పడేది మా నెత్తిమీద! వాడెందుకు

చచ్చాడూ? ఎట్లా చచ్చాడూ? వాడే చచ్చాడా, ఇంకెవరివల్లనయినా చచ్చాడా-? ఇవన్నీ కనుక్కోలేక మేము చావాలి!"

"అవును! పాపం!" జాలిపడ్డాడు చిరంజీవి. "నిజంగా వాళ్ళందర్నీ షూట్‌చేసినా పాపం లేదు!"

"కొంచెం కూడా లేదు?" వప్పుకున్నాడు కానిస్టేబుల్.

మరో నిముషం నిశ్శబ్దంగా గడిచింది.

"అయితే నువ్వు ఆత్మహత్య చేసుకోవడానికి రాలేదంటావ్?"

"నూటికి నూరుపాళ్ళూ కరెక్ట్!"

"ఈ అర్ధరాత్రి ఈ వంతెనమీదకి కేవలం ఆ... అదేం అడవితెగ?"

"కోషిబా!"

"ఆ! 'కోషిబా' గురించి ఆలోచించడానికి వచ్చానంటావ్?"

"సరిగ్గా తెలుసుకున్నారు!"

"అయినా నాకేం నచ్చలేదు!"

"ఏమిటీ?" ఖంగారుగా అన్నాడు చిరంజీవి.

"అదే! ఆ కోషిబా తెగవాళ్ళు ఆ పెళ్ళి కొడుకుని క్రిమినల్ ఎసాల్ట్ చేయడం!"

"నిజమే! నాకూ నచ్చలేదు! కానీ ఏం చేస్తాం? అది వాళ్ళ ఆచారం!"

"ఈ ఆచారాలు- అయ్‌మీన్, మూఢాచారాలు 'బాన్' చేయాలి!"

"తప్పకుండా!"

మరో రెండు నిమిషాలు 'కోషిబా' గురించి ఆలోచించాడు కానిస్టేబుల్.

ఆ విషయంలో తను చేయదగ్గదేమీ కనిపించలేదతనికి.

"సరే - నేను పోతున్నాను" అక్కడినుంచి ముందుకి నడిచాడతను.

"గుడ్‌నైట్ సర్!"

"గుడ్‌నైట్..." అని రెండడుగులు వేసి మళ్ళీ వెనక్కు వచ్చాడతను.

"ఇదిగో చూడు రాంబాబూ!"

"నా పేరు చిరంజీవండీ!"

"చూడు చిరంజీవి- ఒకవేళ నీకు ఎప్పుడయినా ఆత్మహత్య చేసుకోవలనిపిస్తే ఈ

వంతెనమీద నుంచి దూకి చేసుకోవద్దు! ఇక్కడికి ఓ మైలు దూరంలో ఇంకో బ్రిడ్జి వుంది. అక్కడ చేసుకుంటే నాకేం అభ్యంతరం లేదు. ఎందుకనో తెలుసా?"

"తెలీదండీ!"

"ఆ బ్రిడ్జి మా స్టేషన్ లిమిట్స్‌లో లేదు. అంచేత మనకేమీ బాధ్యత వుండదు. సరేనా?"

"సరేనండీ!"

అతను వెళ్ళిపోయాడు.

చిరంజీవి అతను పూర్తిగా కనుమరుగయేంతవరకూ చూస్తూ అక్కడే నిలబడిపోయేడు.

ఇంకతను ఆలస్యం చేయగూడదు. చేస్తే ఇలాగే ఏదోక అంతరాయం తప్పదు. గోడవేపు నడిచాడు చిరంజీవి.

"మాష్టారూ?" ఎవరో పరుగుతో వస్తున్న చప్పుడు.

వెనక్కు తిరిగి చూశాడు చిరంజీవి.

బక్కగా వున్న ఓ వ్యక్తి గాలిలో ఎగురుతున్నట్లు పరుగెడుతూ వచ్చాడక్కడికి.

అతని కాళ్ళు అరిగిపోయినట్లున్నాయ్.

గడ్డం పెరిగిపోయింది.

ప్రాణం కళ్ళల్లో వుంది.

"మీరు, ఆత్మహత్య చేసుకుంటున్నారా?" ఒగురుస్తూ అడిగాడు తను.

"కాదు! సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను" చిరాగ్గా అన్నాడు చిరంజీవి.

అతను అర్థం కానట్లు మొఖం పెట్టాడు.

"లేకపోతే ఏమిటయ్యా! నా యిష్టం వచ్చినట్లు చేసుకుంటాను. మధ్యలో నీకెందుకు?" కోపంగా అన్నాడు చిరంజీవి.

ఆవ్యక్తి కొంచెం జంకాడు.

"అది కాదండీ! ఒకవేళ మీరు ఆత్మహత్య చేసుకొనేటట్లయితే..."

"పోలీసుల కప్పజెప్పతానంటావ్! అంతేనా?"

"రామ! రామ! అంతపని నేనెందుకు చేస్తానండీ!"

"అయితే మరెందుకు ఆపుతున్నావ్ నన్ను?"

"నేనెందు కాపుతానండీ! ఆమాటకొస్తే మీరు ఆత్మహత్య చేసుకోవడమే నాకు కావలసింది!"

చిరంజీవికి అతనిమీద సదభిప్రాయం ఏర్పడింది.

"అంటే?"

"మీరు ఆత్మహత్య చేసుకోవడం కన్నా నేను కోరుకొనేదింకేమీ లేదండీ! ఎటొచ్చీ చేసుకునేముందు నాకో చిన్న సహాయం చేస్తారేమోనని!"

"ఏమిటది?"

"మీరు మరోలా భావించకండి! మీరు వుంటున్న ఇంటి అడ్రస్ నాక్కావాలి! ఓ ఇల్లుకోసం వెతికి వెతికి వేసారిపోయాను సార్ ఈ అయిదేళ్ళనుంచీ! నా బాధ చూడలేక మా ఫ్రెండ్ ఒకడు సలహా ఇచ్చాడు. సాధారణంగా ఆత్మహత్యలు చేసుకునేవాళ్ళు ఈ బ్రిడ్జిమీద నుంచే దూకి చస్తుంటారనీ, వాళ్ళను బ్రతిమాలుకుంటే వాళ్ళు చావటం వల్ల ఖాళీఅయే గదులు ఒకోసారి అద్దెకు లభిస్తాయ్ నీకూ అని! వాడికిలాగే మాంచి ఇల్లు దొరికింది లెండి!"

ఆ రోజునుంచీ రాత్రుళ్ళు ఈ బ్రిడ్జిమీదే తిరుగుతున్నాను. నా దురదృష్టమేమిటోగాని పదిరోజులయినా సరయిన కేసే దొరకటం లేదు. అంతా ఇల్లూ వాకిలీ లేని సన్నాసులే తగిలారు. ఎందుకో మిమ్మల్ని చూస్తుంటే తప్పక మీకో ఇల్లూ వాకిలీ వుంటుందని అనిపించింది. దయచేసి మీ అడ్రస్ చెప్పండి సార్! ఆ తరువాత నిరభ్యంతరంగా దూకేయండి! కావాలంటే దూకడంలో మీకు సహాయం చేస్తాను."

"సహాయమా?"

"అవున్సార్! మీకు ఇంత ఎత్తునుంచీ దూకడానికి ఒక వేళ బెరుగ్గా వుంటే నేను బలంగా తోసివేస్తాను! నన్ను నమ్మండి!"

"ఇంతవరకూ ఇల్లు లేకుండా ఎక్కడ ఉంటున్నావ్ మరి?"

"ఫుట్‌పాత్ లాంటి చోట!"

"మరి అక్కడినుంచీ మారడం ఎందుకూ?"

"నాకు రెండేళ్ళ క్రితం పెళ్ళయింది. ఇన్నాళ్ళూ మా ఆవిడ వాళ్ళ ఊరిలోనే వుంది. మరో నెల లోపల ఆమెను కాపురానికి తీసుకు వెళ్ళకపోయినట్లయితే విడాకులిస్తానని ఈ మధ్య వార్నింగిచ్చిందండీ! అందుకే ఇలా వీధిన పడ్డాను. మీ వల్లనయినా నాకా ఇల్లు దొరికితే మీ పేరు చెప్పుకుని మీ ఇంట్లో సంసారం చేసుకుంటాను."

చిరంజీవికి అతన్ని చూస్తే జాలివేసింది. వెంటనే తన ఇంటి అడ్రస్ డయరీలోనుంచీ చింపిన ఓ కాగితంపై రాసి అతనికిచ్చాడు.

"చూడు! ఇంటి అద్దె ఎనభై రూపాయలు. ఒకే ఒక్క గది! నీళ్ళు అర్ధరాత్రి రెండు గంటలనుంచీ రెండున్నర వరకూ వస్తాయ్! బాత్‌రూమ్, పాయిఖానా ఎనిమిది కుటుంబాలకు కామన్! కరెంట్‌కి పది రూపాయలు– ఇవే ఆ ఇంటివివరాలు."

"థాంక్యూసర్! చాలా థాంక్స్! నా కాపురం నిలబెట్టేరు."

"ఫరవాలేదు ! వెళ్ళిరండి!"

అతను ఆనందంగా ఆనందభాష్పాలు తుడుచుకుంటూ వెళ్ళిపోయాడు.

ఇంక ఆలస్యం చేయగూడదనుకుని మళ్ళీ గోడదగ్గరకు నడిచాడు చిరంజీవి. కళ్ళు మూసుకుని దూకడానికి సిద్ధమయ్యాడు.

"ఏవండోయ్! ఒక్క నిమిషం ఆగండి!" దూరం నుంచీ వేగంగా పరుగెత్తుతూ వచ్చాడో యువకుడు.

చిరంజీవి అతని దగ్గరకు నడిచాడు.

"ఏం కావాలి మీకు?"

"చేస్తాను! ముందు మనం పరిచయం చేసుకుంటే బావుంటుంది. నాపేరు శ్రీరామ్. 1974లో బి.కామ్ పాసయ్యాను. అప్పటినుంచీ ఇప్పటివరకూ నూట అరవై ఎనిమిది ఇంటర్వ్యూల కెళ్ళాను. ఒక్కదాంట్లో కూడా సెలక్ట్ కాలేదు"

"అయితే, నన్నేం చేయమంటారు!"

"అలా కోప్పడకండి! ఇది నా గురించి పరిచయం! మరి మీ గురించి."

"ఇదిగో చూడండి! నేను మీ పరిచయ భాగ్యం కోసం కాదు ఇక్కడకొచ్చింది!"

"అఫ్‌కోర్స్! నాకూ తెలుసనుకోండి! మీరు ఆత్మహత్య చేసుకోడానికి వచ్చి వుంటారు."

"అసలు విషయం."

"సరే, మీకంత చిరాగ్గా ఉంటే అసలు విషయంలో కొచ్చేస్తాను. మీరెలాగూ చనిపోతున్నారు. చనిపోయేముందు ఓ చిన్నపుణ్యం చేస్తే ఎకాఎకీన స్వర్గానికి వెళ్ళిపోతారు. నేను నాలుగేళ్ళ నుంచీ వుద్యోగం కోసం తిరిగి తిరిగి ఫలితం లేకుండా పోయింది. ఎక్కడికెళ్ళినా రికమండేషన్లు, నోవేకెన్సీ బోర్డులే! చివరకు పేపర్లో ఓ రోజు ఓ చనిపోయిన వారి వుద్యోగం కోసం బోలెడుమంది నిరుద్యోగులు 'క్యూ' కట్టిన వార్త చదివాను. నాకు

బ్రహ్మాండమయిన  అయిడియా వచ్చింది. ఈ నదిలో ఎలాగూ బోలెడుమంది  బోలెడు కారణాలవల్ల ఆత్మహత్య చేసుకుంటూనే వుంటారు.వాళ్ళ ఉద్యోగాల వివరాలు తెలుసుకుంటే ఆ ఉద్యోగాలు దొరికే అవకాశం వుంటుంది కదా అని.''

''అంటే చచ్చేవాడు ఛస్తే చావనీ– వాడి వుద్యోగం మాత్రం ముఖ్యమన్నమాట మీకు!'' అక్కసుతో  అడిగాడు చిరంజీవి.

''ఇందులో అనౌచిత్యమేముందండీ! మీ బ్రతుకెలాగూ బుగ్గయిపోతోంది. దాని ద్వారా నా బ్రతుకు బావు చేసుకుంటే మీకు మాత్రం ఆనందంగా ఉండదూ? నా తమ్ముడూ, చెల్లాయీ, మా నాన్నా, అమ్మా, అమ్మమ్మా – ఇంతమందికి మీ వుద్యోగం నాకు లభించడం ద్వారా తిండిపెడితే ఎంత పుణ్యం మీకు?

''సరే సరే – నేనే ఆఫీస్‌లో పనిచేస్తున్నానో చెప్పమంటారు!  అంతేనా?''

''అంతేకాదు! నేను మీ వరుస తమ్ముడిననీ, మీ వుద్యోగం నాకిస్తే మీ కుటుంబాన్ని కొంతవరకూ నేను పోషించే బాధ్యత స్వీకరించగలననీ మీ ఆఫీసరుగారికో రికమండేషన్ లెటర్రాసి ఇవ్వండి!''

జేబులోనుంచి కాగితం పెన్ను తీసి యిస్తూ అన్నాడతను.

చిరంజీవి ఓ నిముషం ఆలోచించి అతను చెప్పినట్లే రాసి ఇచ్చేశాడు.

అతను వెళ్తుండగానే మరో యువకుడు పరుగుతో  వచ్చాడక్కడికి.

''మీరు ఆత్మహత్య చేసుకుంటున్నారాండీ?''

''అవును! నాఇల్లు వుద్యోగం రెండూ ఎడ్వాన్స్ బుకింగ్ అయిపోయాయ్? ఇంకేం కావాలి మీకు?''

''అయ్యో! అదికాదండీ! నేను జర్నలిస్ట్‌ని. మాంఛి సెన్సేషనల్ న్యూస్‌లు రాసినవాడికే ప్రమోషన్  అని మా ఎడిటర్ హఠాత్తుగా ఓ నిబంధన పెట్టాడు. దాంతో జర్నలిస్ట్ లందరం రోడ్లవెంబడి పడ్డాం. నాకు ఓ బ్రహ్మాండమయిన అయిడియా వచ్చింది. ఆత్మహత్యలు చేసుకొనే వాళ్ళందరి జీవితచరిత్రలూ సేకరించి ప్రచురిస్తే దానంత సెన్సేషనల్ ఇంకేమీ వుండవుకదా! అందుకని రోజూ ఈ బ్రిడ్జిదగ్గరే కాపలా కాస్తున్నాను. ఫరవాలేదులెండి! ఇప్పటికి  ఆరు జీవిత చరిత్రలు దొరికాయ్. దయచేసి మీ జీవిత చరిత్ర కూడా.''

''అంటే నేను ఆత్మహత్య చేసుకోవడం పోస్టుపోన్ చేసుకుని మీకు జీవిత చరిత్ర రాసివ్వమంటారు!''

"నో నో నో- మీరు ఆత్మహత్య చేసుకోవడం షెడ్యూల్ ప్రకారం జరిగిపోవల్సిందే! నేనడిగేదది కాదు. మీకు డయిరీ రాసే అలవాటుంటే మీ ఇంటికెళ్ళి అదితెచ్చుకుంటాను."

చిరంజీవికి నవ్వు వచ్చింది. ఓ నిముషం ఆలోచనలో పడ్డాడు.

"బాబ్బాబు? ఆలోచించకండి! మీ కాళ్ళు పట్టుకుంటాను. ప్రమోషన్ అంటే మాటలు కాదు. అరవై రూపాయలు జీతం పెరుగుతుంది. అరవై రూపాయలంటే ఎంత పెద్దదో మీకు తెలీదేమో! నా జీవితమే మారిపోతుంది సార్!"

"అరవై రూపాయలకు జీవితం మారిపోతుందా?"

"మెల్లగా అంటారేమిటండీ! మా కుటుంబం మొత్తం రెండుపూటలా తిండి తినేందుకు వీలవుతుంది. అంతేకాదు. మా పెద్దాడిని స్కూల్లో చేర్పించి ఫీజు కట్టేందుకు సాధ్యమవుతుంది. మా ఆవిడ తన మెట్రిక్ పూర్తిచేయగలుగుతుంది. అది పూర్తయితే తనకో చిన్న వుద్యోగం దొరుకుతుంది. ఆ తరువాత మాకిక ఏ బాధలూ వుండవ్... హాయిగా, సుఖంగా, ప్రశాంతంగా" స్వర్గంలో తేలిపోతున్నట్లు మాట్లాడసాగాడతను.

"ఏయ్ మిస్టర్" పిలిచాడు చిరంజీవి.

"ఆ! చెప్పండి!" ఊహాలోకం నుంచి బయట పెడుతూ అన్నాడు చిరంజీవి.

"ఇదిగో నా డయిరీ! ఇందులో నా జీవితం చాలావరకూ కనబడుతుంది. చాలా?"

అతను చిరంజీవి కాళ్ళమీద పడిపోయాడు.

చిరంజీవి దూరంగా జరిగాడు.

"లేవండి! అదేమిటి?"

"నా కృతజ్ఞతసార్!" లేచి నిలబడుతూ అన్నాడతను.

"నేనంత గొప్పపనేమీ చేయలేదు. వెళ్ళిరండి!"

"థాంక్యూసర్- మా పేపర్లో మీ ఫోటో కూడావేసి కృతజ్ఞత తెలియజేసుకుంటాన్సార్."

వెళ్ళిపోయాడతను.

అతను వెళ్తూండగానే ఓ కారు వేగంగా వచ్చి ఆగిందక్కడ.

"ఏయ్ మిస్టర్ " కార్లోంచి పిలిచాడొహతను.

"ఏమిటండీ!" భయంగా అడిగాడు చిరంజీవి.

"ఇలారా!"

చిరంజీవి కారు దగ్గరకు నడిచాడు.

"నువ్వు ఆత్మహత్య చేసుకోడానికి వచ్చావ్ కదూ?"

"అవును!"

కార్లో వాళ్ళందరూ మొఖామొఖాలు చూసుకున్నారు.

వెంటనే డోర్ తెరచుకుని ఇద్దరు కిందకు దిగారు.

"నీ పేరేమిటి?" అడిగాడొకతను. అతని ఖద్దరు బట్టలూ అవీ చూస్తూంటే ఓ పెద్ద నాయకుడిలా కనిపించాడు.

"చిరంజీవి అండీ!"

"నీది ఏ కానిస్టిట్యూయేన్సీ?"

"ఇదే ఏరియా సార్!"

చెప్పాడు చిరంజీవి.

"వెరీగుడ్! అయితే నన్ను గుర్తుపట్టలేవా?"

"లేదండీ!"

"క్రింది జన్రలెలక్షన్లలో ఎమ్మెల్లేగా పోటీచేసి ఓడిపోయాను! నా పేరు భోలాశంకర్"

"అలాగా! నమస్కారమండీ! బావున్నారా?"

"ఫరవాలేదు! ఇంతకూ నువ్వెందుకు ఆత్మహత్య చేసుకోవాలనుకుంటున్నావ్?"

"ఒకటేమిటి సార్! లక్షకారణాలు! ఎటు చూసినా జీవితం అంథకారంగానే కనబడుతోంది! ఇలాంటి కాకిబ్రతుకు, అయ్‌మీన్ కుక్క బ్రతుకు బ్రతకడం కంటే చావడం మంచిదనిపించింది... అంతే! వచ్చేశానిక్కడికి."

"అవునోయ్! నాకూ, ఎలక్షన్లో ఓడిపోయినప్పుడు అలాగే అనిపించింది. ఈ బ్రిడ్జిమీదకే వచ్చి రాత్రంతా గడిపాను! చివరకు నిర్ణయం మారిపోయిందనుకో! అది వేరేసంగతి! ఆత్మహత్య ఎందుకు చేసుకోవాలనిపించిందో తెలుసా? ఎలక్షన్ల కోసం ఆస్తంతా ఖర్చుచేసి పారేశాను. అప్పులయిపోయినయ్. మరింకెలా బ్రతకడం! సరే అదంతా నీకెందుగ్గానీ– ఇప్పుడు నువ్వో సహాయం చేయాలి నాకు!"

"చెప్పండి! తప్పక చేస్తాను. మీకు తెలుసో తెలీదో గాని మొన్న ఎలక్షన్లో కూడా నా ఓటు మీకే వేశాను! మీ పార్టీ అంటే అంత అభిమానం నాకు!"

"నా ఓటే నన్నమాట! అయితే నాకింకా ఏ పేచీలేదు!" అనందంగా అన్నాడతను.

"మీకేం కావాలో చెప్పండి! తప్పక చేస్తాను. ఆనందంగా చేస్తాను."

మరింత అభిమానంతో అన్నాడు చిరంజీవి.

ఆ రాజకీయనాయకుడి కళ్ళ వెంబడి నీళ్ళు తిరిగినయ్. అతను త్రాగిన బ్రాందీ వాసన గుప్పుమంది.

ఛటుక్కున చిరంజీవిని కౌగలించుకుని భోరున ఏడ్చేశాడు.

"ఇదేనోయ్ నాకు సంతృప్తి! ఆస్తంతా పోనీ, ఇంకా అప్పులవనీ! ఫరవాలేదు! కానీ నా తరఫు ప్రజలు– నన్ను ఎంతగా ప్రేమిస్తున్నారో, నాకు ఎలాంటి సహాయం కావలసినా చేయడానికి ఎంత సంసిద్ధంగా వున్నారో, తల్చుకుంటే నా జీవితమంతా నాశనమయి పోయినా సరే ఫరవాలేదనిపిస్తుంది. ఈ ఒక్క రాజకీయం తప్పిస్తే ఇంతగా ప్రజాభిమానం పొందే ఫీల్డు మరేముందోయ్! సినిమా ఫీల్డుందంటే ఏ హీరోకయినా అభిమానులుండేది కొద్దికాలమే. ఆ తరువాత అంతా కొత్త హీరో వేపు పరుగెడతారు. కానీ రాజకీయం అలాక్కాదు. ఎంతకాలమయినా ప్రజాభిమానం అలాగే బూజుపట్టకుండా ఉండిపోతుంది."

"అవునండీ!" వప్పుకున్నాడు చిరంజీవి.

"ఇంతకూ ఇప్పుడు నువ్వు చేయవలసిన సహాయం ఏమిటో తెలుసా?"

"తెలిదండీ!"

"చాలా చిన్న విషయమే ఇది! కానీ నీ ఈ సహాయం వల్ల నా భవిష్యత్తే మారిపోవచ్చు! నేను ఈ రాష్ట్రంలో పెద్ద పదవిని సంపాదించవచ్చు! ముఖ్యమంత్రినయినా నువ్వు ఆశ్చర్యపోనక్కర్లేదు. లేదా, కేంద్రంలో కూడా అడుగు పెట్టేందుకు అవకాశాలున్నాయ్."

చిరంజీవి విస్మయంతో వింటున్నాడతని మాటలు. తన వల్ల అంత గొప్పపని జరుగుతుందా? ఓ ఛోటా రాజకీయనాయకుడిని ముఖ్యమంత్రిగా చేసేంత స్తోమతు తనకు వుందా? బ్రతికుండగా తనవల్ల ఎవరికీ ఏ సహాయమూ లేదు. కానీ తను చస్తే ఇంతమందికి ఇన్ని వుపకారాలు జరుగుతాయా? ఎవరో ఒకరు చావాలని ఇంతమంది రోజూ ప్రార్థనలు చేస్తున్నారా? దేముడా! 'బలి' అంటే ఇదేనా?

"నువ్వు ఓ కాగితంమీద నేను చెప్పినట్లు రాసివ్వాలి. అంతే! మిగతాదంతా మాజిక్ లాగా జరిపేస్తాను."

"ఏం రాసివ్వమంటారండీ!"

"మరేంలేదు. ఈ రోజు రాత్రి సినిమా నుంచి నువ్వూ మీ ఆవిడా ఇంటికొస్తుంటే ఓ పోలీసు నిన్ను చూచి దొంగ అనుకొని పోలీస్ స్టేషన్‌కి లాక్కెళ్ళి రాత్రంతా కొట్టారనీ, నీ భార్యను ఏంచేశారో తెలీదనీ–ఈ అవమానం భరించలేక ఆత్మహత్య చేసుకుంటున్నాననీ రాసివ్వు! చాలు! నాసామిరంగా రేపు తెల్లారే సరికల్లా జనాన్ని పోగుజేసి రాష్ట్రమంతా పెద్ద ఎత్తున అల్లర్లు లేవదీసి ప్రభుత్వాన్ని స్తంభింప జేసేస్తాను."

"కానీ, నాకు పెళ్ళికాలేదుకదండీ ఇంక."

"ఫరవాలేదు! అదంతా మేము చూసుకుంటాం! పెళ్ళి ఇప్పుడే, ఇక్కడే జరుగుతుంది. ఏయ్–సుశీలను తీసుకురండ్రా!" కారు వేపు తిరిగి అరచాడతను.

పాతికేళ్ళ స్త్రీ కార్లోనుంచి దిగి అక్కడి కొచ్చింది.

"ఇదిగో మంళసూత్రం కట్టేసెయ్! మేమంతా సాక్షులుగా వుంటాం!"

తొందరచేశాడు రాజకీయనాయకుడు.

చిరంజీవి ఆశ్చర్యం నుంచి కోలుకోలేకపోతున్నాడు. తనకు ఎదురుగా అతి సమీపంగా నిలబడ్డ ఆ యువతివంక చూశాడు. ఆమె చిరంజీవిని చూసి చిన్నగా నవ్వింది.

చిరంజీవి హృదయంలో తుపాను మొదలయింది.

ఇంత అందమయిన అమ్మాయి మెడలో తను తాళి కట్టబోతున్నాడా? కేవలం కొద్ది క్షణాలే అయినా ఈ దేవతకు భర్త స్థానం పొందటం ఎంత అదృష్టం!

"ఊ త్వరగా కానీ..." తొందరచేశారు వాళ్ళు.

చిరంజీవి ఆమె మెడలో తాళి కట్టేశాడు. కెమేరాలు క్లిక్ మన్నయ్.

"ఇదిగో కాగితం! త్వరగా రాసెయ్! పోలీస్ పార్టీ బీటు కొచ్చే టైమవుతోంది!"

చిరంజీవి కాగితం తీసుకుని సిమెంట్ దిమ్మమీద కూర్చుని రాయడం ప్రారంభించాడు.

దూరంగా సైకిల్ మీద మళ్ళీ పోలీస్ కానిస్టేబుల్ వస్తుకనిపించాడు.

"అదుగో పోలీస్" అన్నా రెవరో.

"అలాగయితే మనం ఇక్కడ వుండడం మంచిది కాదు! అలా బ్రిడ్జి చివర కెళ్ళి మళ్ళీ వద్దాం! ఏయ్ మీ ఇద్దరూ ఇక్కడే వుండండి!" త్వరత్వరగా కారు ఎక్కి స్టార్ట్ చేసుకుని వెళ్ళిపోయారు వాళ్ళు.

కానిస్టేబుల్ కనకారావ్ వచ్చి చిరంజీవి దగ్గర ఆగాడు మళ్ళీ.

"ఏయ్! ఏవరు మీరు?" సైకిల్ దిగి ఇద్దరి మొఖాలమీదా టార్చ్‌లైట్ వేస్తూ అడిగాడు.

"నేనేనండీ చిరంజీవిని! మా అయ్యపేరు ధనుంజయ్! ఇందాక మాట్లాడారు కదండీ!"

'ఈ అమ్మాయెవరు మరి?"

"నా భార్యండీ!"

"నీ భార్య? ఇందాక లేనిభార్య ఇప్పుడెక్కడి కెళ్ళి వచ్చిందయ్యా?"

"ఇంటి పనంతా చేసుకుని ఇప్పుడే వచ్చిందండీ!"

"ఇక్కడికెందుకొచ్చింది?"

"అదా–సంగతేమిటంటేనండి–ఇవాళ్ళ మా పెళ్ళి రోజండీ! అందుకని కాసేపలా సరదాగా తిరుగుదామని–"

"ఏయ్! పెళ్ళయి నీకెంతకాలమయింది? పెళ్ళిరోజయితే హోటల్‌కి పోవాలి! సినిమాకు పోవాలిగాని ఇలా బ్రిడ్జిలవెంబడీ రైలుపట్టాల వెంబడీ తిరుగుతారా ఎవరయినా?"

"తిరగరండీ..."

"మీ ఇద్దరినీ అసలు లాక్కెళ్ళి లాకప్‌లో వేయాలనుంది గానీ, ఈ రోజుల్లో మా పోలీసోళ్ళ పొజీషన్ కొంచెం వీక్‌గా ఉంది...ఆడాళ్ళ విషయంలో– అందుకని వదిలేస్తున్నా! అర్థమయిందా?"

"అయింది సార్!"

"ఈ బ్రిడ్జి కట్టించింది నీలాంటి భార్యాభర్తల విహారాల కోసం కాదు..."

"సరేనండీ..."

"మళ్ళీ నేను తిరిగి వచ్చే సరికి ఈ ప్రాంతంలో ఎక్కడా కనిపించకూడదు. తెలిసిందా!"

"తెలిసింది సార్...."

సైకిల్ ఎక్కి కొంతదూరం వెళ్ళిమళ్ళా వెనక్కు తిరిగి వచ్చాడతను.

"ఇదిగో–వాళ్ళెవరు బాషికా అడవి తెగన్నావ్ కదూ?"

"బాషికా కాదండీ! 'కోషీబా'!"

"ఆ! కోషిబా! నేను వాళ్ళ గురించి బాగా ఆలోచించాను. ఎట్టయినా గానీ నేను అక్కడ ఎలక్షన్ డ్యూటీయో, స్పెషల్ డ్యూటీయో వేసుకుని వాళ్లందరినీ కటకటాల్లో వేస్తా! చూస్తూండు..."

"కానీ జపాన్ అంటే ఇంకోదేశమండీ..."

"తెలుసులేవయ్యా! ఇంకో డిస్ట్రిక్ట్ అంటావ్! అంతనే కదా!

"కాదండీ...ఇంకోదేశం! అంటే..."

"ఇంకో రాష్ట్రమయినా సరే–నేనాళ్ళను వదిలేది లేదు. జైల్లో వేసేది ఖాయం! నా సంగతి నీకు తెలీదు. ఒక మర్డర్‌కి గురించి ఒరిస్సా రాష్ట్రం కూడా వెళ్ళొచ్చా!"

"కానీ అది ఇంకో దేశం–అంటే మనదేశంలోనే లేదండీ..."

"ఎక్కడయినా గానీ మన పోలీస్ స్టేషన్ ఏరియాలోనే ఉంటుంది కదా! చూస్తుండు! మొత్తం అందరినీ లాకప్‌లోకి తోసేస్తా..."

"సరేసార్..."

అతను వెళ్ళిపోయాడు. చిరంజీవి ఆ యువతి వేపు చూశాడు మళ్ళీ.

"నీ పేరు సుశీల కదూ?"

"ఊ!"

"నిన్ను వీళ్ళెక్కడినుంచి తీసుకొచ్చారు?"

"నేను నాటకాలేస్తూంటాను. ఒకతను నన్ను మోసం చేసిన దగ్గర్నుంచీ ఆ నాటక కళంటే విరక్తి పుట్టింది. సరిగ్గా అప్పుడే ఈ నాయకుడు పిలిపించాడు నన్ను–" నిర్భయంగా చెప్పిందామె. చిరంజీవి మనసంతా ఆమె మీద జాలితోనూ ప్రేమతోనూ నిండిపోయింది.

"నీ కెవ్వరూ లేరా?"

"మా అమ్మ ఉంది. ఇప్పుడు నా భర్తగా మీరున్నారు" నవ్వుతూ అందామె. అంటూనే హఠాత్తుగా ఏడ్చేయసాగింది.

చిరంజీవి గాబరాపడి పోయాడు.

"సుశీలా! ఏమిటిది? ఏడుపెందుకు?" ఆమె భుజంమీద చేయివేసి తడుతూ అన్నాడు.

అతని కౌగిట్లోకి వరిగిపోయిందామె.

"మీకు తెలీదండీ! ఈ రోజుకోసం నేను ఎంతకాలం నుంచీ కలలు కంటున్నానో, ఎంతగా తపించిపోతున్నానో మీకు తెలీదు. ఎప్పటికయినా నన్ను ప్రేమించే మనిషి లభిస్తారనీ, నా మెడలో ఎవరయినా పుణ్యాత్ములు తాళికడతారనీ, వారి సరసన 'సంసార స్త్రీగా' నా జీవితం మలచుకోవాలనీ నేను వేయికళ్ళతో ఎదురు చూశాను. ఆ ఆశ అడుగంటి పోతున్న సమయంలో–కొద్ది క్షణాలకోసమే కావచ్చు. నా కోరిక తీరింది. నేను వివాహితురాలినిప్పుడు! దేముడిచ్చిన వరమండీ ఇది! సామాన్యమయిన అదృష్టంకాదు!"

చింరజీవి చలించిపోయాడు. ఆమెమీద ప్రేమ పొంగిపొరలింది.

"సుశీలా!" ఆమెను భుజంమీద ప్రేమగా చేయివేశాడు. అతనికి కొత్త ఆశలు చిగురించాయ్. కొత్త కోరికలు మొలకెత్తాయ్.

అవును! తనకు ఉద్యోగం వుంది, ఇల్లువుంది. తనని ప్రేమించేవారున్నారు. ఇవేమీ లేకుండా ఎన్నో సంవత్సరాల నుంచీ జీవితం అలా ఆశలతోనే, కలలతోనే గడిపేస్తున్నవారూ తనకు తారసపడ్డారు. తను ఆత్మహత్య చేసుకోబోతూంటే, తన

ఇల్లుకోసం ఒకరు, తన ఉద్యోగం కోసం ఒకరు–ఇలా ఇంకెంతమందో వారు అనుభవిస్తున్న బాధలు నిజానికి తన బాధలకంటే దారుణమయినవి. అయినా వారు చావాలనుకోవడం లేదు. భవిష్యత్తుమీద వారికి ఆశ వుంది. ఏదో సాధించగలమన్న నమ్మకం వుంది. వారందరూ అంత ఆత్మస్థైర్యంతో, నమ్మకంతో, ఆశతో జీవిస్తూన్నప్పుడు తనెందుకు భయపడాలి? ఎందుకు పిరికివాడిలా పారిపోవాలి?

"సుశీలా!" పిల్చాడు చిరంజీవి!

"ఏమిటండీ?" తలెత్తి అతనివంక చూస్తూ, కన్నీళ్ళు తుడుచుకుంటూ అంది సుశీల!

"నువ్వు శాశ్వతంగా నా దానివిగా, నా భార్యగా వుంటావా?"

ఆమె ఆశ్చర్యపోయింది. 'అదేమిటి? మీరు ఆత్మహత్య..."

"అదంతా అదివరకటి విషయం సుశీలా! నేనెప్పుడు నా మనసు మార్చుకున్నాను. నీకు అంగీకారమయితే నాతోరా! మనం కొత్త జీవితం ప్రారంభిద్దాం!"

ఆమె చేయిపట్టుకుని ఆవేశంగా అన్నాడతను.

"ఇదంతా నిజంగా అంటున్నారా? నాకు నమ్మ బుద్ధికావటంలేదు" ఆశగా అడిగిందామె.

"పిచ్చి సుశీలా! చెప్పానుకదా! ఇప్పుడు నా జీవితం అర్ధమే మారిపోయింది. పద! వాళ్ళు వచ్చే లోగానే మనం ఇక్కడి నుంచి వెళ్లిపోవాలి."

ఇద్దరూ చేతులు పట్టుకుని బ్రిడ్జిమీద పరుగెత్తసాగారు.

ఇద్దరి కళ్ళనుంచీ వుండుండి ఓ కన్నీటి చుక్క రాలుతోంది.